అప్పుడే ఆఫీసునుంచి వచ్చి, చొక్కా విప్పి గదిలోని చిలక్కొయ్యకి తగిలిస్తున్న కృష్ణమూర్తికి తండ్రి మూలగడం వినిపించింది.

చివుక్కుమంది కృష్ణమూర్తి మనస్సు.

కొంతసేపు మౌనంగా నిలుచుండి పోయాడు.

మళ్లీ తండ్రి మూలగడం వినిపించింది.

ఈసారి మూలుగుతోపాటు పొడిదగ్గు కూడా వినిపించింది.

ఆ పొడిదగ్గులో ఆయాసం మిళితమై ఉంది.

గబగబా లుంగీ చుట్టబెట్టుకొని తండ్రి మంచం ఉన్న గదిలోనికి వెళ్లాడు కృష్ణమూర్తి.

పక్కగదిలోకి అంతగా వినిపించటం లేదుగాని, పరంధామయ్యకి దగ్గు ఎక్కువగానే వస్తూంది.

ఆయాసంతో కలిసిన దగ్గు కావడం వల్ల ఏకబిగిన కాక తెరలు తెరలుగా వస్తూంది.

దగ్గు వచ్చినప్పుడల్లా గుండెలు ఆయాసంవల్ల ఎగిరెగిరి పడుతున్నాయి.

ఆదుర్దా వ్యక్తపరుస్తూ, "ఎలా ఉంది, నాన్నా! ఎక్కువయినట్టుందే?" అని కృష్ణమూర్తి అడిగాడు తండ్రిని.

తెరలుగా దగ్గుతూ, "అవున్రా, కృష్ణా!. . . ఎక్కువయినట్టే. . . కనిపిస్తూంది. . . గుండెలు ఎగబట్టేస్తున్నాయి. . . ఊరికే. . !" కొడుకుతో చెప్పాడు పరంధామయ్య.

గొంతులో చిరాకు కనపరుస్తూ, "అయినా నువ్వు అస్తమానమూ పడుకొనే ఉంటావు. కాస్సేపు లేచి కూర్చుంటే దాని ఉధృతం అంతగా ఉండదు. కాస్సేపు లేచి కూర్చొని చూడు, తేడా నీకే తెలుస్తుంది!" అన్నాడు కృష్ణమూర్తి.

పెదవులపైకి శుష్కహాసాన్ని తెచ్చిపెట్టుకొని, "ఏమోరా! లేచి కూర్చోగల. . . సత్తువే కనక. . . ఈ శరీరంలో ఉంటే. . . ఈ క్షయవ్యాధిని దగ్గిరికి... రానిచ్చిఉండేవాణ్ణిట్రా! . . . రాతరా, వాయనా! నుదుటి రాత. . తప్పించుకోగలగడం ఎవరితరం?. . . ఏ జన్మలోనో పాపంచేసి ... ఉంటాను. అది నన్నిప్పుడీ రూపంలో... పీడించుకు తింటూంది..." అంటూ మళ్లీ ఆయాసపడిపోయి దగ్గడం మొదలుపెట్టాడు పరంధామయ్య.

మొహం మరో పక్కకి తిప్పుకొని నిలుచున్నాడు కృష్ణమూర్తి.

అతని మనస్సు తుఫానుసమయంలో చెలరేగే సముద్రంలా ఉంది. అంతటి

**ఎప్పుడైనా చావచ్చు కాని రోగం మూలంగా చావడమనేది మాత్రం ఖాయం. తండ్రి శరీరంలో తిష్ఠ వేసుకొని కూర్చున్న రోగం ప్రాణం బలి తీసుకోకుండా విడిచిపెట్టడమన్నది జరగదు. బ్రతికినంత కాలమూ తండ్రి రోగం పీడించేది మాత్రం తండ్రిని కాదు, తనయుని!**

సంక్షోభంలోనూ అతని మనస్సు ఆలోచించగలుగుతూంది.

తనకి ఒంట్లో ఏమాత్రం నలతగా ఉన్నా తన తండ్రి తనని గురించి ఎంతగా కలతపడేవాడో కృష్ణమూర్తికి ఊహ తెలిసినప్పటినుంచీ తెలుసు.

ముక్కు చీదినా, కొంచెం మందంగా కనిపించినా, ఆడుకోకుండా కూర్చున్నా, తెరిపిలేకుండా ఏడ్చినా కృష్ణమూర్తిని డాక్టరు దగ్గిరికి తీసుకు పరిగెత్తేవాడు పరంధామయ్య.

కొడుక్కి జ్వరం వస్తే కొడుకు మంచం పక్కనే పీట వేసుకొని కూర్చునేవాడు. జ్వరం చప్పగా చల్లారేదాకా ఆ మంచం దగ్గిరనుంచి కదిలేవాడు కాదు.

కృష్ణమూర్తిని అంత జాగ్రత్తగా, ఆప్యాయంగా, గారాబంగా పెంచాడు పరంధామయ్య.

తండ్రి చేతుల్లో ఎంత గారాబంగా పెరిగినా, కృష్ణమూర్తి నిజంగా దురదృష్టవంతుడు.

తల్లి ఒడిలో పెరిగే భాగ్యం కలగలేదతనికి. భూమిమీద పడ్డ వెంటనే తల్లిని పైలోకాలకి ప్రయాణం చేయించాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి దురదృష్ట జాతకుడన్నారు, బంధువుల్లో చాలామంది!

కాని, పరంధామయ్య మాత్రం అందు కంగీకరించలేదు. కృష్ణమూర్తికి బ్రహ్మాండమైన భవిష్యత్తు ఉందన్నాడు.

కొడుకు తనకంటె ఘనమైన బ్రతుకు బ్రతుకుతాడని ఆశించాడు.

పరంధామయ్య తన కొడుకును చూసుకొని మురిసిపోయాడు, ప్రతి తండ్రిలాగానే!

కొడుకును నేలమీద నడవనీయలేదు. పువ్వుల్లో పెట్టి పెంచినట్టు పెంచాడు.

ఆర్థిక పరిస్థితులు తారుమారయ్యే సమయానికి కృష్ణమూర్తి పెద్ద డిగ్రీచదువులు చదవలేదు.

తండ్రి గారాబం వల్ల కృష్ణమూర్తికి సామాన్యమైన చదువు మాత్రమే వంటబట్టింది.

లోకజ్ఞానం తెలిసివచ్చి, కనువిప్పు కలిగిన సమయంలో కృష్ణమూర్తి చదవడానికి పరంధామయ్య చితికిపోయాడు.

పూట గడవడమే కష్టమయిపోయింది. అప్పటికి పరంధామయ్య శరీరంలో ఓపికా ఉడిగిపోయింది.

కొడుకు కష్టపడడం చూసి విలవిల లాడిపోయాడు పరంధామయ్య.

తనకు ఊహ తెలిసిన దగ్గిరనించీ జరిగిన ప్రతి సంఘటనా కృష్ణమూర్తికి జ్ఞాపకముంది.

అన్యమనస్కంగా ఉన్న కృష్ణమూర్తి తండ్రి పిలుపుతో ఈ లోకానికి వచ్చాడు.

మధ్యతరగతి కుటుంబీకు లందరి లాగానే కృష్ణమూర్తి కళ్లలోనూ నైరాశ్యం పేరుకొని ఉంది, దేనికీ కరగని శిలలా!

"ఏరా, కృష్ణా, డాక్టరు రాసిచ్చిన మందు తింటే తగ్గుతుందేమోరా!" అన్నాడు పరంధామయ్య.

అతని మాటల్లో జీవితం మీద ఆశ ఉంది.

అతడే కాదు, ప్రతి మనిషీ అంతే! చస్తూకూడా ఇంకా బ్రతకా లనుకుంటాడు. తనకి తెలీకుండానే చచ్చే మనిషికి జీవితం మీద బోలెడంత ఆశ.

గమ్యం చేరేంతవరకూ ఎంత విసుగుతో ప్రయాణించినా, గమ్యం చేరువవుతున్న కొద్దీ దూరం పెరిగితే బావుండు ననిపిస్తుంది.

బండి నలిగిన బాటన పోతూంటే గమ్యం చేరుకున్నా, ఇంకా ప్రయాణించా

## కొరిపెల్ల రామప్రసాదరావు

లనే ఉంటుంది.

కాని, పరంధామయ్య నలిగిన బాటన నడవడం లేదు. అయినా అతని కింకా నడవాలని ఆసక్తి ఉంది.

తండ్రి మాటకి కృష్ణమూర్తి, "ఊఁ!" అని మాత్రం అనగలిగాడు. అంతకుమించి మరో అక్షరంకూడా అదనంగా పలికే స్థితిలో లే డతడు.

తండ్రి జీవితం గమ్యానికి దగ్గిరవుతూందని అతనికి తెలుసు. తెలిసినా మమకారంకొద్దీ మందూ మాకూ ఇప్పించాడు.

మందులు తినమరిగిన రోగం మరింత ముదిరిపోయి ప్రాణం శరీరాన్ని వదిలేంత వరకూ తనూ వదలనని గట్టిగా కౌగిలించుకొంది.

అది మృత్యువు కౌగిలి!

ఆ కౌగిలి అంతకంతకూ బిగుసుకుంటూంది. దాన్ని సడలించడం కృష్ణమూర్తికి చేతకాలేదు.

కొడుకు కళ్లలోకి ఆశగా చూస్తూ, "బజారుకి వెడతావు గామోసు, వచ్చేటప్పుడు మందు తీసుకొస్తావా?" అని అడిగాడు పరంధామయ్య.

తండ్రి ఆశని చంపలేని కృష్ణమూర్తి "ఊఁ!" అని అన్నాడు నిర్లిప్తంగా, క్లుప్తంగా.

కాని కృష్ణమూర్తి కళ్లలోని నిస్సహాయత పరంధామయ్య స్పష్టంగా గమనించగలిగాడు.

చావుబ్రతుకుల మధ్య ఊగిసలాడుతూన్న పరంధామయ్య కొడుకు స్థితిని చూచి జాలి చెందాడు.

నీళ్లు నిలిచాయి పరంధామయ్య కళ్లలో!

"కృష్ణా!" అంటూ కొడుకుని పిలిచాడు.

శుష్కించిన పరంధామయ్య స్వరం నూతిలోనుంచి వచ్చినట్టు వినిపించి కృష్ణమూర్తి తండ్రికేసి తిరిగాడు.

"ఊఁ!" అంటూ మూలిగాడు కృష్ణమూర్తి చిన్నగా.

సామాన్యుడు కృష్ణమూర్తి.

సామాన్యుడీ శతాబ్దంలో మాట్లాడటం నేర్చుకొనీ మాట్లాడే శక్తి లేక మూలుగుతున్నాడు, నిస్సహాయంగా!

సామాన్యుడి మూలుగులో యావత్ ప్రపంచ చరిత్రా ఉంది!

కొడుకును చూసి, "ఇలా రా! ఇలా వచ్చి మంచంమీద కూర్చో!" అన్నాడు పరంధామయ్య, హీనస్వరంతో.

మంచంమీద కూర్చోలేదు కృష్ణమూర్తి.

మంచంపక్కనే గొంతు కూర్చున్నాడు!


పక్కనే కూర్చుంటే తండ్రి రోగం తన కంటుకుంటుందనే భయంతో కాదు, చావలేక బ్రతికే మనిషిలా ఉన్న నులకమంచం విరుగుతుందేమో లనే భయంతో!

కొంచెంసేపు ఎడతెరిపి లేకుండా దగ్గాడు పరంధామయ్య.

గుండెలో కలుగుతున్న బాధ భరించలేక మంచంమీద గాలిలో కొంచెం లేచాడు పరంధామయ్య, దగ్గినంతసేపూ గుండె చేతబట్టుకొని.

"ఏమిటి, నాన్నా?" అని అడిగాడు కృష్ణమూర్తి.

"నన్ను ధర్మాసుపత్రిలో చేర్పకూడదురా!" అని చెప్పాడు పరంధామయ్య, శూన్యంలోకి చూస్తూ.




పిచ్చిగా, వెర్రిగా నవ్వుకున్నాడు కృష్ణమూర్తి, ధర్మాసుపత్రులలో ధర్మ వైద్యం ఎంత బాగా జరుగుతూందో తలుచుకొని!

ఆ తలుచుకోవడంలో అతని కో గడిచిన సంఘటన గుర్తుకు వచ్చింది. అది తలుచుకొని మరింత పిచ్చిగా నవ్వుకున్నాడు కృష్ణమూర్తి.

ఓసారి రెండో పిల్లకి జ్వరం తీవ్రంగా ఉంటే, భార్య బలవంతం మీద పిల్లని ధర్మాసుపత్రికి తీసుకువెళ్లాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తిని చూసి వెకిలిగా నవ్వాడు అక్కడున్న బొజ్జడాక్టరు. అతగాడి కళ్లలో ఏదో కాంక్ష మెదులుతూంది లీలగా.

రిటైర్మెంటుకి దగ్గిర పడ్డట్టున్నాడు, నాలుగు డబ్బులు ఏరుకోవాలనే తాపత్రయంలో ఉన్నాడు.

దీపం ఉండగా ఇల్లు చక్కబెట్టుకొమ్మనే సిద్ధాంతాన్ని అనుసరించేవారిలో అతడొకడయి ఉంటాడు.

పిల్లనీ, కృష్ణమూర్తినీ మార్చి మార్చి చూస్తూ, "ఆస్పత్రిలో మంచి మందులు లేవు. పది రూపాయలు పట్టుకొని మా ఇంటికి రా! అమోఘంగా పనిచేసే మందు లిస్తాను" అన్నాడు డాక్టరు అదో మాదిరిగా నవ్వి.

ఒళ్లు మండిపోయింది కృష్ణమూర్తికి, డాక్టరు మాటలలో!

అవసరం తనది గనక వెంటనే చల్లబడిపోయాడు.

"నా దగ్గిర డబ్బు లేదు!" అన్నాడు డాక్టరు కళ్లలోకి నిస్సహాయంగా చూస్తూ.

కృష్ణమూర్తి దగ్గిర నిజంగా పది రూపాయలు లేవు.

అసలే నెలాఖరు రోజులు! సామాన్యంగా నెలారంభంలోనూ కృష్ణమూర్తి వద్ద డబ్బు లుండవు!

నిజం చెప్పుకోవలసివస్తే ఏ రోజూ కృష్ణమూర్తి దగ్గిరగాని, ఇంట్లోగాని డబ్బు ఉండడమనే మాటే ఉండదు.

కృష్ణమూర్తి చూపులకి డాక్టరు కరిగిపోలేదు.

పైగా, "పిల్లని బ్రతికించుకోవాలని లేదూ?" అన్నాడు తీవ్రంగా.

"ఎందుకు లేదు? బిడ్డని బ్రతికించుకోవాలని ఏ తండ్రికయినా ఉంటుంది. మీకు జాలి కలగకపోతే ఎవరు మాత్రం ఏం చేయగలరు? ఆస్పత్రిలో ఉన్న మందులే ఇవ్వండి" అన్నాడు కృష్ణమూర్తి నిరాశగా.

"నీ ఇష్టం! ఎవరి కర్మ కెవరు బాధ్యులు? ఇదిగో! ఈ రంగునీళ్లు పట్టుకు వెళ్లి తాగించు!" చెప్పాడు డాక్టరు వ్యంగ్యం ధ్వనించేలా.

అవాక్కయి పోయాడు కృష్ణమూర్తి.

చేసేది లేక నిస్సహాయంగా ఆ ధర్మాత్ముడి జాలిగుండెకి మనస్సులోనే జోహార్లు అర్పించి ఆ రంగునీళ్లు తీసుకు పోయాడు కృష్ణమూర్తి.

ఆ రంగునీళ్లు తాగిన పిల్లకి జ్వరం తగ్గలేదు సరికదా, మరింత ఎక్కువయిపోయింది.

కృష్ణమూర్తి చెంపలు వేసుకొని, ఎవరినో కాళ్లావేళ్లా పడి బ్రతిమాలి పది రూపాయలు అప్పు తీసుకుని పిల్లతో పాటు డాక్టరుగారింటికి పరిగెత్తాడు.

పది రూపాయలూ జేబులో వేసుకున్నాక ఆ డాక్టరుగారు విజేతలా నవ్వుతూ మందులు ఇచ్చాడు.

అవి ఆస్పత్రి మందులే!

వాటిమీద 'నాట్ ఫర్ సేల్' అని రాసిఉండడం కృష్ణమూర్తి గమనించక పోలేదు.

'రోగం తగ్గించినవాడు ఏ డాక్టరయితేనేం! డబ్బు పుచ్చుకున్నా ఫరవాలేదు!' అని సమాధానపడ్డాడు కృష్ణమూర్తి.

తండ్రి ధర్మాసుపత్రి ప్రసక్తి తీసుకువచ్చేసరికి గడిచిన సంఘటన గుర్తుకు వచ్చి విరక్తిగా నవ్వుకొన్నాడు కృష్ణమూర్తి.

ఎంతకీ కొడుకు ఏ సమాధానమూ చెప్పకపోయేసరికి పరంధామయ్య మళ్లీ అదే మాట అడిగాడు.

"ఎందుకు, నాన్నా? వద్దు! అది ధర్మాసుపత్రి కాదు. మనుషులని పీడించుకు తినడానికని ప్రభుత్వం వాటిలో హృదయంలేని డాక్టర్లని వేస్తూంది. డబ్బు, నాన్నా, డబ్బు. . . డబ్బు లేని వాళ్ల కిది ప్రపంచం కాదు. . . నరకం. డబ్బే ప్రపంచం!" అన్నాడు కృష్ణమూర్తి నైరాశ్యంతో నవ్వుతూ. "అవి మృత్యునిలయాలు, నాన్నా, మృత్యునిలయాలు!" గాద్గదికంగా చెప్పాడు.

కొన్ని క్షణాలపాటు పరంధామయ్య ఏం మాట్లాడలేదు.

కృష్ణమూర్తి మోకాళ్లపై తలపెట్టుకుని కూర్చున్నాడు.

"ఫరవాలేదులేరా!. రేపో మాపో పోయే ప్రాణం గురించి ఎందుకు విచారించాలి? ఈ ప్రాణం ఎక్కడ పోయినా ఒక్కటే! నా మూలంగా కోడలుపిల్ల ఈమధ్య మరీ శ్రమపడిపోతూంది. నన్ను ఆస్పత్రిలో చేర్చినట్టయితే దానికీ శ్రమ తగ్గుతుంది. ఈమధ్య దానికీ ఒంట్లో బావుంటున్నట్టు లేదు" అన్నాడు పరంధామయ్య.

తండ్రి మాటల్లో సహజత్వం లేకపోవడం గమనించాడు కృష్ణమూర్తి.

కాస్తంత వ్యంగ్యమూ కనిపించింది.

"నువ్వూ, నీ పెళ్ళామూ స్వార్థపరులురా!" అని పరోక్షంగా అన్నట్టనిపించింది.

చివుక్కుమంది కృష్ణమూర్తి మనస్సు.

తనని గురించి తండ్రి తన సౌఖ్యాలను త్యజించడం కృష్ణమూర్తికి తెలుసు.

భార్య పోయాక రెండో పెళ్ళి చేసుకోమని ఎంతమంది ఎన్ని విధాలుగా నచ్చచెప్పినా, పరంధామయ్య లక్ష్యపెట్టలేదు.

కారణం!

తన కృష్ణమూర్తి కోసం!

సవతితల్లి కన్నతల్లిలా పెంచదని పరంధామయ్య కొడుకుకోసం శరీర సుఖాలని త్యజించాడు.

అప్పుడే గనక పరంధామయ్య రెండో పెళ్ళి చేసుకొని ఉంటే కృష్ణమూర్తి జీవితం ఎలా మారిఉండేదో!

పరంధామయ్యకి క్షయరోగం అంకురించినందుకు భార్య ఉంటే అతనికి చివరి దశలో ఎంతగా సపర్యలు చేసిఉండేదో!

ఆ లోటు కృష్ణమూర్తి భర్తీ చేయగలడా?

కృతజ్ఞత ఏ రూపంలో ప్రకటించాలి? కృతజ్ఞత ప్రకటించవలసిన అవసరం లేదూ?

కృష్ణమూర్తికి పరిస్థితి అంతా అగమ్యగోచరంగా కనిపించింది.

సరిఅయిన నిర్ణయం కోసం కొన్ని క్షణాలు ఆలోచించాడు. నిర్ణయం తీసుకొనేముందు తటపటాయించాడు.

చివరికి ఒక నిర్ణయానికి రాగలిగాడు.

ఆలోచననుంచి తేరుకొని, "ఏమయినా సరే! వద్దు, నాన్నా, వద్దు! ఫలానా కృష్ణమూర్తి తండ్రి ధర్మాసుపత్రిలో దిక్కులేని చావు చచ్చాడనే నింద నేను భరించలేను. నీలయినంతవరకూ తల తాకట్టు పెట్టి అయినాసరే నీక వ్యాధి బాగుచేయించుతాను. అంతే! ఇతరత్రా ఆలోచనలు పెట్టుకోవద్దు!" అన్నాడు కృష్ణమూర్తి గట్టిగా.

* * *

ఏది ఏమయినా చక్రభ్రమణం మాత్రం ఆగిపోదు.

దొరికినచోటల్లా అప్పులు చేశాడు కృష్ణమూర్తి. ఇచ్చినవాళ్ళ దగ్గిరల్లా డబ్బు వడ్డీలకి తెచ్చాడు.

ఇల్లు అద్దెదయిపోయింది గాని, లేకపోతే అది కాస్తాకూడా తాకట్టు పెట్టేసి ఉండేవాడు.

అన్ని రకాలుగా తెచ్చిన డబ్బంతటినీ వరంధామయ్య జబ్బు తినేసిందే గాని, తగ్గలేదు! కనీసం తిరుగుముఖంకూడా పెట్టలేదు.

గుళ్ళో దేవుడులా పరంధామయ్య శరీరంలో క్షయరోగం తిష్ఠ వేసుకుని కూర్చుంది.

జీతం కాస్తా అప్పులు తీర్చడానికీ, వడ్డీలు కట్టడానికీ సరిపోతూండేది, వచ్చే జీతం తక్కువ కావడంవల్ల.

ఫలితంగా—కొత్త అప్పులు చేయడం ప్రారంభమయింది.

కొన్నాళ్ళకి అప్పులు తీర్చడమనే ప్రసక్తే లేకుండా పోయింది.

ఇంట్లో వస్తువులు వడుకోవడాలు ఆరంభమయ్యాయి. ఓ విధంగా చెప్పవలసివస్తే, కాస్త కోపం ఉన్నా, కృష్ణమూర్తి భార్యకూడా ఓర్పుగల మనిషే!

ఆఫీసులో పొరపాట్లు చేస్తున్నాడు, మనస్సు స్థిమితం లేక! ఆఫీసరుతో చీవాట్లు తింటున్నాడు.

వీధిలో అప్పులవాళ్ళు రాబందుల్లా పట్టుకొంటున్నారు.

బ్రతుకంటే విరక్తి కలిగేలా విసిగిపోయాడు కృష్ణమూర్తి.

నీరసంలో ఉన్న పెళ్ళాంకూడా మంచమెక్కితే తన గతి ఏమిటో అతనికే అర్థం కాలేదు.

అతడి కళ్ళకి ప్రపంచమంతా అంధకారంగా, శూన్యంగా, చైతన్యరహితంగా, భయంకరంగా, ఘోరంగా స్పందనలేని హృదయంలా కనిపించింది.

* * *




అందుకనే ఆమె దగ్గిర కృష్ణమూర్తి ఆటలు బాగా సాగాయి. ఇద్దరూ కలిసి ఎలాగో పిల్లలిద్దరికీ కడుపులు నింపేవారు.

ఇద్దరే పిల్లలు కావడం గుడ్డిలో మెల్లయింది. లేకపోతే, కృష్ణమూర్తి ఇంకెన్ని అగచాట్లు పడవలసి వచ్చేదో!

అర్థాకలి తిండితో భార్యాభర్తలిద్దరూ చిక్కి శల్యమయ్యారు.

కడుపు నిండా తిండి లేకపోవడం వల్లా, ఇంటిపని అంతా చేయక తప్పక పోవడంవల్లా కృష్ణమూర్తి భార్య నీరసించి పోయింది.

సరిగా పనిచేయలేకపోతూంది!

కృష్ణమూర్తి నీరసించి పోయాడు. ఆలోచిస్తున్నాడు కృష్ణమూర్తి.

తను నైతికంగానూ, శారీరకంగానూ, మానసికంగానూ దిగజారిపోవడానికి తండ్రే కారణం!

తనని తండ్రి గారాబంగానే పెంచి ఉండచ్చు! దానివల్ల ప్రయోజనం ఏముంది?

తను చదువు చెడ్డాడు! సాధారణమైన చదువుతో ప్రైవేటు కంపెనీలో గుమాస్తా గిరీ వెంగబెడుతున్నాడు.

రోజుల్లా చేసినా తరగని పని!

గారాబం పెట్టకుండా, శ్రద్ధ తీసుకొని పెద్ద పెద్ద చదువులు చదివించి ఉంటే తనీనాడు పెద్ద హోదాగల ఉద్యోగం చేసేఉండేవాడు.

తను తండ్రికి సరిఅయిన మందూ మాకూ ఇప్పించలేకపోతున్నాడనే అపవాదు రావడానికి అవకాశమే లేకపోయేది.

తనిన్ని అప్పులు చేయవలసిన అవసరమూ, అప్పులవాళ్ళచేత దీవనలు తినవలసిన అగత్యమూ ఉండేది కాదు.

అవసానదశలో తన నింత దుఃఖపెట్టడానికే తండ్రి చేసిన త్యాగాలు పనికి వచ్చాయి.

తండ్రి సుఖాలు త్యజించాడు, తన కోసం! బాగానే ఉంది!

దానివల్ల తను సుఖపడ్డ దేముంది?

తీయని తన భవిష్యత్తును తండ్రి నాశనం చేసి పారేశాడు. హాయిగా, సుఖంగా ఉండవలసిన వయస్సులో తను ఇన్ని ఇక్కట్లకు లోనుకావడానికి తండ్రే కారణం!

తండ్రే కనక రెండో పెళ్ళి చేసుకొని ఉంటే తన జీవితం మరోలా ఉండేది!

సవతితల్లి పెంపకం ఎలా ఉండేదో, ఏమో! అనూహ్యం! తండ్రి సుఖాలు త్యజించకుండా రెండో పెళ్ళి చేసుకొని ఉంటే సవతితల్లి ఎటువంటిదైనా గాని తన జీవితం మరో బాటన నడిచి ఉండేది.

ఇన్ని కష్టాలు పడవలసిన అవసరం ఉండి ఉండేది కాదేమో!

తనకేం ఇచ్చాడని తండ్రిని అవసాన దశలో ఆదుకోవాలి?

చదువా? ఒక స్టేజికి చేరుకోగలిగేంతవరకూ చెప్పించలేకపోయాడు!

ధనమా? ఇవ్వలేకపోయాడు!

ఉన్నది కాస్తా ఖర్చు పెట్టడమే తెలిసిందిగాని, కొడుకు కోసం ఏమాత్రమైనా మిగల్చాలనే ధ్యాస లేకపోయింది.


ప్రపంచంలోని బ్రతుకుతెరువు మార్గాలలో కనీసం ఓ మంచి మార్గమైనా చూపలేకపోయాడు.

అటువంటి తండ్రి కోసం తనెందుకని తన జీవితం పాడుచేసుకోవాలి?

తనని అన్యాయం చేసి, ఎటూ గాకుండా త్రిశంకుస్వర్గంలో వేలాడదీసిన తండ్రిని ఎందుకని పోషించాలి? ఆదరించాలి? వైద్యం చేయించాలి?

తనకు జన్మ నిచ్చినవాడు కావచ్చు. అయినంతలో, నిరక్షకుడై తన బ్రతుకును తనే సాగించలేకపోతున్న తను తండ్రిని పోషించాలని ఎక్కడుంది?

తండ్రి ఏ ఉద్దేశంతో, ఏ నిర్ణయం చేసుకొని, ఎన్ని త్యాగాలు చేసినాగాని అవన్ని తనకి శత్రువులుగా పరిణమించాయి.



వర్షానికి నాంది

ఫోటో—ఆర్. బి. షిండే (కొల్హాపూర్-2)

తండ్రి రోగంకోసం చేసిన అప్పులు తీర్చడానికి తన జీవితం చాలదు. రెక్కలు ముక్కలయేట్లు కష్టపడి పనిచేసినా, మరో జన్మలోనూ తన అప్పులు తీర్చలేడేమో!

రేపు తన పిల్లలకి తను ఏం సమాధానం చెబుతాడు?

వాళ్ల భవిష్యత్తేమిటి?

తన తండ్రి తనకి ఏమీ ఇవ్వనట్లే, తనూ తన పిల్లలకి ఏమీ మిగల్చకపోతే పోయాడు, కనీసం వాళ్ల భుక్తికి వాళ్లు సంపాదించుకొనే తెలివి కలిగించే చదువయినా చెప్పించలేకపోతే ఎలా?

రేపు వాళ్లు తన ప్రాణానికి పడి ఏడ్చినప్పుడు వాళ్ల ఉసురు తనకి తగడకుండా ఎక్కడికి పోతుంది?

తండ్రి ఇంకా ఎంతకాలం రోగంతో తీసుకుంటాడో ఊహ కందని విషయం. చావటం మాత్రం ఖాయం! ఎప్పు డనేది అనిశ్చయం!

ఎప్పుడు చచ్చినాగాని రోగంమూలంగా చావడమనేదీ ఖాయమే! తండ్రి శరీరంలో తిష్ట వేసుకొని కూర్చునున్న రోగం ప్రాణం బలి తీసుకోకుండా విడిచిపెడుతుం దనేది జరగదు.

బ్రతికినంతకాలమూ తండ్రి రోగం పీడించేది తండ్రిని కాదు, తనని! తండ్రి ప్రాణాలతోబాటు తన శరీరంలోనూ రక్తమాంసాలు పీల్చివేసేటట్టుంది.

దీనికి పరిష్కారమార్గం ఏమిటి?

తన పిల్లల భవిష్యత్తు బంగారుబాట చేయడంకోసమయినా తను బ్రతికి ఉండాలి!

అందుకు తను ఏం చేయాలి?

సమాధానం దొరకక ఆలోచనలు మరో పక్కకి మళ్లించాడు కృష్ణమూర్తి.

"తండ్రి రోగంతో తీసుకొంటున్నాడు. అతడు చనిపోతాడనేది ఖాయం. ఎప్పు డనేది ఊహ కందని విషయం.

అతని ప్రాణాలు ఏ క్షణంలోనయినా అనంతవాయువుల్లో కలిసిపోవచ్చు.

గొంతు నులిమి చంపేస్తే?

రోగంతో చనిపోయాడని అనుకుంటారంతా! అంతేగాని, కొడుకు తండ్రిని హత్య చేశాడని ఎవరూ అనుకోరు! అనుమానించారు! ఊహించలేని విషయం!"

ఈ ఆలోచన వచ్చేసరికి కృష్ణమూర్తి ఆవేశపడిపోయాడు. అతని కీ ఆలోచన చాలా మంచిదిగా తోచింది. ఇన్నాళ్ళగా తను ఇలా ఆలోచించలేకపోయినందుకు తనని తాను నిందించుకున్నాడు.

ఆవేశం అనర్థాలకి మూలమే కాదు, మనిషిలోని విచక్షణని నశింపజేస్తుంది. ఆవేశంలో మనిషి ఉచితానుచితాలు మరిచిపోయి రాక్షసుడవుతాడు.

కృష్ణమూర్తి రాక్షసుడయ్యాడు. అతనిలో పాపభీతి నశించింది.

గొంతు నులిమి చంపితే తండ్రి కనీసం అరవనుకూడా అరవలేడు. అరవడానికి ఓపిక లేదు. తండ్రి ప్రాణాలు తీయడానికి ఓ క్షణం చాలు!

తరవాత తను సుఖంగా బ్రతకవచ్చు!

కృష్ణమూర్తిలో పైశాచికత్వం తల ఎత్తి వికృతాట్టహాసం చేసింది.

మనసులోని బరువంతా తగ్గిపోయి శరీరం తేలికపడినట్లు ఫీలయ్యాడు కృష్ణమూర్తి.

* * *

అర్ధరాత్రి!

అంధకారం అలముకొని ఉంది అంతటా!

కృష్ణమూర్తి నెమ్మదిగా వచ్చి తండ్రి గది తలుపు తెరిచాడు, శబ్దం కాకుండా జాగ్రత్తపడుతూ! గదిలో భయంకర నిశ్శబ్దం నాట్యం చేస్తూంది.

మామూలుగావినిపించే పరంధామయ్య గురక వినిపించడం లేదు, మగతగా నిద్రపట్టడంవల్ల కాబోలు!

గదిలో పరంధామయ్య తలపక్కగా ఉన్న కిరసనాయిలు దీపం కిటికీలో నుంచి వీస్తున్న గాలికి రెపరెపలాడుతూంది.

అడుగులో అడుగు వేసుకొంటూ తండ్రి తల దగ్గిరికి నడిచాడు కృష్ణమూర్తి. అతని కనులలో భయానకత తాండవిస్తూంది. కళ్లలో రక్తం పేరుకొని ఉంది, ఎర్రగా!

రెపరెపలాడుతూన్న దీపాన్ని ఊదేసి తండ్రి తలమీదికి వంగాడు.

నశించిన విచక్షణతో రెండు చేతులతో గొంతు పట్టుకున్నాడు, నులమడానికి.

తండ్రి శరీరం చేతులకి చల్లగా తగలడంతో ఉలిక్కిపడ్డాడు. తనకి అడ్డం తొలగుతూ, రోగం బారినుంచి తప్పించుకొని మరో లోకానికి తండ్రి పారిపోయాడని గ్రహించడానికి కృష్ణమూర్తికి కొన్ని క్షణాలు పట్టింది.

"నాన్నా!" అంటూ శక్తికొద్దీ అరిచి తండ్రి శవంమీదికి వాలిపోయాడు కృష్ణమూర్తి.

గదిలో పేరుకొన్న చీకటి, నిశ్శబ్దమూ కలిసి కృష్ణమూర్తిని వెక్కిరించాయి! ★